సింధుభైరవి - ఆది

పాపినైన నా - పాలగలిగి త్రోవ
జూపమన్ననెందు - జూపరు

ధృతి మాలి జగమెల్ల - తిరిగివేసరితి
యితరాయములకేగి - వేసరితి
గతిమాలి పరులపై - గనలి వేసరితి
మతిమాలి కులవిద్య - మాని వేసరితి

విసిగి యాచారంబు - విడిచివేసరితి
పసచెడి ప్రియములు - పలికి వేసరితి
కొసరి ద్రవ్యంబుపై - గోరి వేసరితి
కసుగందిలోలోన - కాగి వేసరితి

కోవిదులగు వారి - గొలచి వేసరితి
దైవములందరి - దగిలి వేసరితి
శ్రీవేంకటేశుని - సేవమాని వట్టి
సేవలన్నియును నే - జేసి వేసరితి

అసంతృప్తుడైన జీవుని వేదన ఈ సంకీర్తనలో పెసువెల్లువయై పరవళ్ళు తొక్కుతున్న ది. పూర్వాశ్రమ వృధా జీవన చర్యలను పశ్చాద్విమర్శాబుద్ధితో కావించే యోగి గతకాల స్మృతులూ, పూర్వజన్మ జ్ఞానంగల్గిదైవాంశ సంభూతుడై, త్రికాలవేదియైన పరమహంస ప రివ్రాజకాచార్యుల పరమార్థాన్వేషణలోని అనిత్యవస్తు తిరస్కరణా, నిత్యవస్తు ధ్యాన పునశ్చ రణా ఇందులో ధ్వనిస్తున్నాయి. అన్నమాచార్యుల మనోవేదన ఈ సంకీర్తన రూపమైనది. సంకీర్తనాచార్యుల ఆత్మశోధన సంకీర్తనగా అవతరించింది.

పాపవశాన జన్మించాను. నాకెవరూ దారి ఇది అని చూపలేదు. మార్గ దర్శకులై ఎవరూ ఇంత పుణ్యం కట్టుకోలేదు అని ఆచార్యుల ఉవాచ.

దారిగానని కారణాన ఆధైర్యం కలిగి జగమంతా దారిగానక తిరిగి తిరిగి ఆయాస పడ్డాను. జన్మసాఫల్యానికై ప్రయత్నించక అప్రస్తుతమైన విషయాల వెంటపడి శ్రమపడ్డాను. నా లక్ష్యమేమో, గతి యేదో యెరుగక, అన్యులపై ఆగ్రహించాను. ఆ ఆగ్రహంవల్ల అశాంతి జెందాను. ఆ అశాంతివల్ల మతిహీనుడ నై కులవిద్యను తాతల నాటినుండి వస్తున్న సంప్రదాయాన్ని విడిచిపెట్టి వెంగలినయ్యాను. (ఇక్కడ కులవిద్య స్మార్తబ్రాహ్మణ్యం, అన్నమాచార్యులు నందవరీక నియోగ బ్రాహ్మణుడు జన్మరీత్యా).

కులవిద్య మానిన తర్వాత మతం మారింది. అద్వైతి విశిష్టాద్వైతి అయినాకగూడ ఆ మార్పులవల్ల వచ్చిన చిత్తక్షోభ తగ్గలేదట ఆయనకు. అప్పటికింకా రాజాశ్రయం తప్పలే దేమో. పసచెడి- మనసు బిగువులేని కారణాన - ప్రియములు - రాజ రాజ్యాధికార ప్రియభాషణలు పల్కటంచేత, ఆచార్యులవారికి అత్యధికమైన ఆత్మాసహిష్ణుత కలిగింది. ధనాదులపై లోభమోహేచ్ఛలు కలిగినవి. తన వివేకభ్రష్ట వినిపాతవైఖరిని తిలకించితే ఆయన ఆత్మవస్తువు గాయపడి, కడునొచ్చుకొన్నది. తన జీవనగతి గమనవేగాలను ఆ యన స్వకీయమైన తర్కంతో, విచికిత్సా విశేష బుద్ధితో తను తనకన్న వేరైనట్లు, అన్యదృ ష్టితో అవలోకించ గలిగారు. ఆత్మవిమర్శ చేయగలిగారు. భర్తృహరి చెప్పిన సుభాషిత త్రిశతిలోని

‘శిరశ్శార్వం స్వర్గా త్పశుపతి శిరస్త్య క్షితిధరం
మహీధ్రా దుత్తుంగా దవని మవనిశ్చాపి జలధిం
అధోగంగా సేయంపదము పగతాస్తోక మధవా
వివేక భ్రష్టానాం భవతి విని పాతః శతముఖః

అన్నశ్లోకాన్ని తనకు తానే అన్వయించుకోగల మహామనీషి ఆయన. (తాత్పర్యం : గంగ ఆకాశం నుండి శివుని శిరం మీదకూ, అందునుండి హిమవత్పర్వ తాలకూ, అటనుండి భూమికీ, భూమినుండి సముద్రానికీ, అక్కడనుండి గాలికూడా చొరని పాతాళానికి ప్రవహిస్తూ పతనం చెందుతున్నది. అదే విధంగా వివేకం వినాశనమై నవారికి పతనం ఒక్కరీతిగా ఉండదు. నూరు విధాలుగా వాటిల్లుతుంది).

ఈ స్థితిలో ఆయన కోవిదులు, పండితులు అనుకోబడేవారిని ఆశ్రయించి, సేవిం చి అదికూడా వ్యర్థ యత్నమేనని గ్రహించి, నిరాశ చెందారు. ధూర్జటి అంటాడు ఈ పం డితుల-కోవిదుల-అయ్యవార్ల- గురించి ఒక మాట.

అయవారై చరియింపవచ్చు, దనపాదాంభోజ తీర్థమ్ములన్
దయతో గొమ్మనవచ్చు, సేవకుని యర్థ ప్రాణదేహాదుల
న్ని యునా సొమ్మనవచ్చుగాని సిరులన్నిందించి, నిన్నాత్మని
ష్ఠియతన్ గానగరాదు పండితులకున్ శ్రీకాళహస్తీశ్వరా

ఇటువంటి కుహనా కోవిదులవల్ల, దొంగ పండితులవల్ల వచ్చే ప్రమాదం ఏదో కూడా నిర్ణయించాడు ధూర్జటి మహాకవి.

చదువుల్నేర్చిన పండితాధములు స్వేచ్ఛా భాషణ క్రీడలన్
వదరన్ సంశయ భీకరాటవుల ద్రోవల్తప్పి వర్తింపగా
మదన క్రోధ కిరాతుడందుగని భీమ ప్రౌఢిచే దాకినన్

చెదరున్ చిత్తము చిత్తగింపగదవే శ్రీకాళహస్తీశ్వరా !

ఈ పండితులు చదువులు నేర్చారుగానీ పరమేశ్వరాను సంధాన విద్య నేర్వలేదు. వారి మాటలు విని అగమ్యగోచరాలైన సందేహాలు కలిగి, ఆ సంశయపు టడవులలో తిరుగుతుంటే, కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్య స్వరూపుడైన బోయవాడు నిల్వరించరాని మెరుపుదాడి చేయగా నాచిత్తం చెదరి చంచలమౌతున్నది. చిత్తగించవలె నన్నాడు. అన్నమాచార్యులకు అదే అవస్థ దాపురించింది. శ్రీమాన్ శతగోపయతి మంత్ర రాజం ఆచార్యులవారికి ఉపదేశించిన తర్వాత పరిస్థితి చక్కబడి ఉండాలి.

ఇతరములన్నీ దైవమని కొలిచి, ఆయాసపడి అలసిపోయారు ఆచార్యులు శ్రీవేంకటాచల విభుని సేవలుకొని యితరకార్యము లన్నీ ఆయనకు సహింపరాని వయ్యాయి. తైత్తిరీయోపనిషత్తులోని భృగువల్లికి అన్యాపదేశంగా అలరుతున్నవి ఈ సంకీర్తనలోని ఉపక్రమణ పరాకాష్ఠలు. ఓం భృగుర్వైవారుణిః వరుణం పితర ముపసశార అధీహిభగవో బ్రహ్మేతి తగ్ంహోవాచ తపో బ్రహ్మేతి సతపోతప తాపసస్తప్త్వా! భృగుమహర్షికి వరుణి అనే పుత్రుడు ఉన్నాడు. అతడు తండ్రిని సమీపించి బ్రహ్మర్షీ నాకు బ్రహ్మమును తెలియజేయమన్నాడు. తండ్రి భృగుమహర్షి అన్నాడు "తపమాచరించు అందువల్లమాత్రమే బ్రహ్మజ్ఞానం సిద్ధిస్తుంది" అని.

వరుణి తపమొనర్చాడు. అన్నం బ్రహ్మమనుకొన్నాడు. అన్నంవల్లనే పాంచ భౌతికసృష్టి ఏర్పడుతుంది. తద్రాహిత్యంవల్ల సృష్టి సంహారక్రియ కల్గుతున్నదని భావించి, తండ్రికి విన్నవించాడు. ఆయన భృగుమహర్షి అన్నాడు. 'తపోబ్రహ్మేతి' అని, తిరిగి వారుణి తపమొనర్చాడు. ఈ సారి ప్రాణం బ్రహ్మమనుకున్నాడు. తండ్రి మళ్ళీ తపస్సు చేయమన్నాడు. ఈ పర్యాయం మనస్సు బ్రహ్మమని భావించాడు. తండ్రి మళ్ళీ తపమొనర్చుమన్నాడు. ఈమారు విజ్ఞానం బ్రహ్మమనుకొన్నాడు. తండ్రి అంగీకరించలేదు. తిరిగి తపమొనర్చాడు వరుణి.

ఈ తడవ ఆనందమే బ్రహ్మమని వారుణి తెలుసుకొన్నాడు. 'ఆనందం బ్రహ్మేతివ్యజానాత్, ఆనందాయేన ఖల్విమాని భూతాని జాయంతి, యేన జాతాని జీవతి' ఆనందంవల్లనే సృష్టి స్థితిసంహార క్రమక్రియలు ఏర్పడుతున్నవి. భృగు మహర్షి ఇదివిని మౌనంతో అంగీకారాన్ని తెలిపారు.' సైషాభార్గవీ వారుణీ' విద్యా ఇది భృగువల్లి.

ఈ సంకీర్తనలో అన్నమాచార్యులు పొందుపరచిన తార్కికుని వివేచనా, తాత్వికుని ఆలోచనా ప్రరోచనా అపూర్వమైనవి. తార్కికులు చేసే పూర్వపక్షీకరణం Doctrine of Reductio ad absurdum 'దీనివల్ల వేసరినాను అందుచేత ఇది నిష్ప్రయోజనకారి' అన్న భావపు మాటలకూర్పు పరివ్రాజకాచార్యులు, పరమ హస్తులు పాటించే బ్రహ్మం ఇది కాదు. నిత్యం ఇదీ కాదు అన్న నేతిప్రకార తత్వదర్శన నిరూపణా విధానమూ - అనన్యసామాన్యం. 'ఏది

ఆనందదాయకం ఈ దుఃఖ భావమైన జీవనంలో అన్న Scientific Enquiry
'శ్రీ వేంకటేశ్వర చరణ కమల సేవమాత్రమే' అన్న సంశోధిత సమాధానమూ అన్నమాచా
ర్యుల చిచ్ఛక్తికి తార్కికమై ఆధ్యాత్మిక తత్త్వ చింతన (Rational
Aesthetism) కుతార్కాణాలు.